పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# కల్లూరులో మురుగునీటి సమస్య తీవ్రం

## అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆందోళన







**దొరవారిసత్రం, పెన్ పవర్ ఆగస్టు 13:** తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం కల్లూరు గ్రామ పంచాయతీలో మురుగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో మురుగునీరు బహిరంగ ప్రదేశాల్లో నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గత ఏడాది నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది, మండల అభివృద్ధి అధికారి కార్యాలయం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ సరైన స్పందన లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఆగస్టు 3న కూడా సమస్యపై అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు నేరుగా ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మురుగునీటి సమస్య మరింత తీవ్రమవుతోందని వారు విమర్శిస్తున్నారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమల ఉద్ధృతి పెరిగి, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత దిగజారకముందే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించడంతో పాటు శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీకాళహస్తిలో అర్ధరాత్రి రేషన్ బియ్యం అక్రమ రవాణా కలకలం

## స్థానికుల అప్రమత్తతతో పట్టుబడ్డ అక్రమ తరలింపు అధికారుల చర్యలపై ఎదురుచూపు



**శ్రీకాళహస్తి/తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 13:** శ్రీకాళహస్తి పట్టణంలో పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం కలకలం రేపింది. పట్టణంలోని కుమారస్వామి తిప్ప ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో భారీగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాలను స్థానికులు గుర్తించి అడ్డుకున్నట్లు సమాచారం. సుమారు అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు గతంలోనూ వినిపించాయి. తాజాగా కుమారస్వామి తిప్ప ప్రాంతంలో అర్ధరాత్రి వేళల్లో బియ్యం తరలింపు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అర్ధరాత్రి వేళల్లో తరలింపు :** స్థానికుల కథనం ప్రకారం.. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న సమయంలో కొందరు స్థానికులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో వారు అప్రమత్తమై వాహనాలను అడ్డుకున్నట్లు సమాచారం. అయితే ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలిస్తున్నారు. ఎంత పరిమాణంలో ఉంది. అక్రమ రవాణా వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే అంశాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

**రేషన్ దుకాణం ప్రమేయంపై ఆరోపణలు :** ఈ అక్రమ రవాణా వ్యవహారంలో స్థానిక రేషన్ దుకాణం డీలర్‌కు సంబంధం ఉన్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

**పేదల బియ్యంపై అక్రమ వ్యాపారం ఎలా :** రేషన్ బియ్యం అక్రమంగా తరలింపునకు గురైతే ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యం పక్కదారి పడకుండా అధికారులు నిఘా పెంచాలని వారు కోరుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో రేషన్ బియ్యం తరలింపునకు సంబంధించి వాహనాల వివరాలు, బియ్యం పరిమాణం, రేషన్ దుకాణం వివరాలు, సంబంధిత వ్యక్తుల పాత్రపై అధికారులు దర్యాప్తు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ :** రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సమన్వయంతో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ రవాణా నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# నేతన్నల సంక్షేమంపై అసత్య ప్రచారం మానుకోవాలి



**ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 13:** నేతన్నల సంక్షేమంపై రాజకీయ ఆరోపణలు చేయడం మానుకుని వాస్తవాలతో మాట్లాడాలని బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని డిమాండ్ చేశారు. గురువారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ ధర్మవరం రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, పట్టణ అధ్యక్షుడు జింక చంద్ర తదితరులు మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ప్రయోజనం అందించడమే లక్ష్యమని తెలిపారు. సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, అర్హత కలిగిన వారెవరూ మిగిలిపోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 'నేతన్న నేస్తం' పథకం అమలులో అవకతవకలపై ఫిర్యాదులు, విచారణలు జరిగిన విషయాన్ని గుర్తుచేస్తూ.. నేతన్నల సంక్షేమంపై మాట్లాడే ముందు వాటిపై కేతిరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాలు పారదర్శకంగా జరిగాయని, సుమారు 5.77 లక్షల మంది అభ్యర్థులు దాదాపు 16 వేల ఉద్యోగాల కోసం పోటీ పడ్డారని తెలిపారు. ఇటీవల జరిగిన హత్య ఘటనను రాజకీయంగా పక్కదారి పట్టించేందుకు సంక్షేమ పథకాల అంశాలను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. హత్య ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందని, వాస్తవాలు వెలుగులోకి రావడానికి దర్యాప్తు సంస్థలకు అవకాశం ఇవ్వాలని కోరారు. చేనేత, బీసీ వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు. ఆధారాలతో విమర్శలు చేయాలి తప్ప అసత్య ఆరోపణలు చేయరాదని స్పష్టం చేశారు. సమావేశంలో బత్తలపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు భాస్కర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, నాయకులు కొంకా నాగార్జున, పనిశెట్టి శివశంకర్, ఓం ప్రకాష్ గౌడ్, జూటూరు వెంకటేష్, పెద్దకోట్ల ఆనంద్, నరేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# డీపీ చాక్లెట్ పరిశ్రమలో మృతి చెందిన సునీల్ కుటుంబానికి రూ.40 లక్షల పరిహారం



**వరదయ్యపాలెం, పెన్ పవర్ ఆగస్టు 13 :** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని డీపీ చాక్లెట్ తయారీ పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బుచ్చినాయుడుకండ్రిగ మండలం వెస్ట్ వరత్తూరు గ్రామానికి చెందిన సునీల్ కుటుంబానికి రూ.40 లక్షల పరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. సునీల్ మృతికి సంబంధించి ఆయన కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఎం నాయకులు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం సునీల్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కార్మిక సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిగాయి. కార్మిక సంఘాల నాయకులు మెలుగు రమేష్, అంబాకం చిన్నిరాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్ధన్, సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు సామర్ల హరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘు తదితరుల ఆధ్వర్యంలో చర్చలు నిర్వహించారు. చర్చల అనంతరం సునీల్ కుటుంబానికి రూ.40 లక్షల పరిహారం చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు జనార్ధన్, రమేష్ తెలిపారు. మృతుడి మైనర్ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా పరిహారం మొత్తాన్ని వారి పేర్లపై బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడానికి పరిశ్రమ యాజమాన్యం అంగీకరించినట్లు నాయకులు వెల్లడించారు. దీనికి అదనంగా ప్రమాద బీమా, పీఎఫ్, ఇతర బీమా ప్రయోజనాలు కూడా కుటుంబ సభ్యులకు వర్తిస్తాయని యాజమాన్యం తెలిపినట్లు పేర్కొన్నారు. చర్చల సందర్భంగా బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన సీపీఎం నాయకులు నలుగురి రమణయ్య, బాల గురవయ్య, ధనంజయ, వరదయ్యపాలెం మండల సీపీఎం నాయకులు సుబ్బయ్య, రమణయ్య, సత్యవేడు సీపీఎం నాయకులు కృష్ణయ్యతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు, పరిహారం కోసం చర్చలు జరుగుతున్న సమయంలో డీపీ చాక్లెట్ పరిశ్రమ వద్దకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాలెం, సత్యవేడు, నాగలాపురం మండలాలకు చెందిన ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పరిశ్రమ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఇసుక అక్రమ రవాణాపై నాగలాపురం పోలీసుల మెరుపు దాడులు





**నాగలాపురం, పెన్ పవర్ ఆగస్టు 13 :** తిరుపతి జిల్లా నాగలాపురం మండలం నందనం ఇసుక రీచ్ వద్ద ఇసుక అక్రమ రవాణాపై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. అరుణానది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు 22 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా గనుల శాఖ సహాయ సంచాలకుడు బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున 3 గంటల నుంచే సిబ్బంది ప్రధాన రహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను గుర్తించి వాటిని అడ్డుకున్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు చంద్రశేఖర్, మహేశ్, పోలీసు సిబ్బంది సహకారంతో వాహనాలను అదుపులోకి తీసుకుని నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణానికి తరలించారు. అరుణానది నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి తరలించడంతో పాటు ఒకచోట పోగుచేసి, అక్కడి నుంచి తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు గనుల శాఖ అధికారులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడంతో పాటు నదీ వనరులకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వడం, తరలించడం, నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నందనం ఇసుక రీచ్ పరిసర ప్రాంతాల్లో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిఘాను మరింత పెంచుతామని అధికారులు తెలిపారు. తెల్లవారుజామున నిర్వహించిన ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు పట్టుబడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# రాయల చెరువు బాధిత రైతులకు రూ.1.09 కోట్ల ఆర్థిక సాయం

## కేవీబీ పురంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటన

## బాణాసంచా పేల్చి, పూలమాలలతో ఘన స్వాగతం పలికిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు






**సత్యవేడు, పెన్ పవర్ ఆగస్టు 13 :** తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీ పురం మండలంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం పర్యటించారు. ఎమ్మెల్యేకు మండల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బాణాసంచా పేల్చి, పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**రాయల చెరువు తెగిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం :** కేవీబీ పురం మండల కేంద్రంలోని రాయల చెరువు గత నవంబర్‌లో అకస్మాత్తుగా తెగిపోవడంతో చెరువు నీరు పంట పొలాల్లోకి ప్రవహించింది. దీంతో కళత్తూరు, పాతపాలెం, ఓళ్లూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలు దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాధిత రైతుల సమస్యను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ వేదికగా రైతుల పరిస్థితిని వివరించి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ఎమ్మెల్యే కృషితో రూ.1.09 కోట్ల పరిహారం :** ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన ప్రయత్నాల ఫలితంగా రాయల చెరువు బాధిత రైతులకు ప్రభుత్వం తరఫున ఒక కోటి తొమ్మిది లక్షల 13వేల ఆర్థిక సహాయం అందింది. కేవీబీ పురం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధిత రైతులకు నష్టపరిహార చెక్కులను అందజేశారు. తమ సమస్యను అసెంబ్లీ వరకు తీసుకెళ్లి, ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరు అయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పరిహారం అందడంతో రైతులు ఉపశమనం వ్యక్తం చేశారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా :** ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. "ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం" అనే భావనతో ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజలకు తాను అండగా ఉంటానని ఆదిమూలం స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైనప్పుడు మండల రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, పోలీసు అధికారులను సంప్రదించాలని తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. రైతుల సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి, వారికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు బాధిత రైతులు మరోసారి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్న కుటుంబాలకు కొండంత అండ సీఎంఆర్ఎఫ్

## : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

### 28వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### కోవూరులో ఇప్పటి వరకు 1,100 మందికి దాదాపు రూ. 10.75 కోట్ల సాయం

### '2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' ప్రచారంలో 79 వేల గృహాల సందర్శన



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 13 :** ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని వీపీఆర్ ( వి.పి.ఆర్ ) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గానికి చెందిన బాధితులకు 28వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా 23 బాధిత కుటుంబాలకు రూ.13.67 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అదేవిధంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తరఫున మరో 12 కుటుంబాలకు రూ. 7.70 లక్షల విలువైన సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆపదలో ఉన్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్నప్పుడు వారి కళ్లలో కనిపించే ఆనందం ఎంతో గొప్పదని అన్నారు. పేదల పెద్దదిక్కుగా నిలిచి ఎన్నో కుటుంబాలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోవూరు ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సుమారు 1,100 మందికి దాదాపు రూ. 10.75 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. అలానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపు మేరకు చేపట్టిన '2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారం 18వ రోజుకు చేరుకుందని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల కృషితో ఇప్పటివరకు 79 వేల గృహాలను సందర్శించి, దాదాపు 91 శాతం ప్రచారాన్ని విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం కాబట్టే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేయడంతో పాటు, ఆక్వా రైతులను ఆదుకోవడానికి యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50కే అందించడం, చేనేత కార్మికుల ఖాతాల్లో రూ. 25,000 జమ చేయడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఆర్‌డీఎస్ఎస్ ( ఆర్.డి.ఎస్.ఎస్ ) కింద విద్యుత్తు మౌలిక సదుపాయాలు, వందల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సాగునీటి సౌకర్యాలు మెరుగుపరిచామని వివరించారు

## వరదయ్యపాలెంలో ఏటీఎం మోసం

### ఏటీఎం కార్డు మార్చి నగదు అపహరణ

### సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు



**వరదయ్యపాలెం,పెన్ పవర్ ఆగస్టు 13:** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు ఏటీఎం వద్ద ఓ యువకుడు మోసానికి పాల్పడి నగదు అపహరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వరదయ్యపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కలత్తూరు గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి మండలంలో గ్రామ రెవెన్యూ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. నెలవారీ వేతనం తీసుకునేందుకు ఆమె వరదయ్యపాలెంలోని ఎస్‌బీఐకు వెళ్లారు. ఈ క్రమంలో ఏటీఎంలో తన ఖాతా నిల్వను పరిశీలించేందుకు వెళ్లగా, చేతికి ఇబ్బంది ఉండటంతో అక్కడ ఉన్న ఓ యువకుడిని సహాయం కోరినట్లు సమాచారం. బాధితురాలి ఖాతా నిల్వను పరిశీలించిన యువకుడు, ఆమెకు తెలియకుండా అదే బ్యాంకుకు చెందిన మరో ఏటీఎం కార్డును ఆమెకు ఇచ్చి, అసలు కార్డుతో అక్కడి నుంచి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం బ్యాంకు అధికారులను సంప్రదించిన ఉమామహేశ్వరి తన ఖాతాలో ఉన్న సుమారు రూ. 14,500 నగదు ఉపసంహరణకు గురైనట్లు తెలుసుకున్నారు. దీంతో ఆమె వరదయ్యపాలెం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్న పోలీసులు, నిందితుడి ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## గాజులమండ్యం ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కేపై అవగాహన



**రేణిగుంట, పెన్ పవర్, ఆగస్టు 13 :** తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గాజులమండ్యం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ.. పాఠశాల వయస్సు పిల్లల్లో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు మెరుగైన చికిత్స కోసం సంబంధిత వైద్య కేంద్రాలకు పంపడం ఆర్‌బీఎస్‌కే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆర్‌బీఎస్‌కేలో భాగంగా జన్మతః లోపాలు, పోషకాహార లోపాలు, చిన్ననాటి వ్యాధులు, అభివృద్ధిలో ఆలస్యం, వైకల్యాలు వంటి నాలుగు ప్రధాన ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని వివరించారు. పాఠశాలలో నిర్వహించే ఆరోగ్య పరీక్షలకు విద్యార్థులు సహకరించాలని, తమకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. చిన్న వయస్సులోనే ఆరోగ్య సమస్యలను గుర్తిస్తే సకాలంలో చికిత్స అందించి పిల్లల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తును మెరుగుపరచవచ్చని కామరాజు పేర్కొన్నారు.

## పెళ్లకూరు ఆర్ఐ ఆకస్మిక మృతి

### రెవెన్యూ సిబ్బంది సంతాపం



**పెళ్లకూరు, పెన్ పవర్, ఆగస్టు 13 :** పెళ్లకూరు మండల తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న టి. సంతోషి బాయ్ ఆకస్మికంగా మృతి చెందారన్న వార్త ఆ కార్యాలయ సిబ్బందిని దిగ్భ్రాంతికి గురి చేసింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో విధులు నిర్వహించిన ఆమె గత మూడు నెలలుగా వైద్య చికిత్స నిమిత్తం ఆమె స్వస్థలమైన తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ లోని మేడిపల్లి ఆమె సొంత గ్రామంలో వైద్యం పొందుతూ మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు సమాచారం చేరవేశారు. ఈ వార్త విన్న తాసిల్దార్ హరికృష్ణ, సహచర సిబ్బంది జీర్ణించుకోలేకపోయారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు దేవుని ఆశీర్వాదం ఉండాలని తెలియజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనలో ఆమె శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో క్రింది స్థాయి అటెండర్ గా పనిచేసే పదోన్నతి పై నాయుడుపేటలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించి, తదుపరి పెళ్ళకూరు తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్గ గా పనిచేశారు. మండల ప్రజలతో మమేకమై, సహచర సిబ్బందితో ఎటువంటి సమస్యలు లేకుండా కలిసిమెలిసి పనిచేసిన ఆర్ఐ సంతోషి బాయ్ అటు ఆ శాఖ అధికారులతో పాటు, మండల ప్రజలు కూడా కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె అంత్యక్రియలు తెలంగాణ రాష్ట్రంలోని మేడిపల్లి గ్రామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## శ్రీధనమల్లి లో ఘనంగా 'డోర్ టూ డోర్' ప్రజా చైతన్య కార్యక్రమం.

### మాజీ సర్పంచ్ పురుషోత్తం మరియు గ్రామ టీడీపీ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో'డోర్ టూ డోర్





**దొరవారిసత్రం, పెన్ పవర్, ఆగష్టు 13 :** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరవేసే లక్ష్యంతో దొరవారిసత్రం మండలం పరిధిలోని శ్రీధనమల్లి పంచాయతీ నందు మాజీ సర్పంచ్ పురుషోత్తం మరియు గ్రామ టీడీపీ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ మరియు 183 పిట్టి రమణయ్య ఆధ్వర్యంలో'డోర్ టూ డోర్' (ఇంటింటికీ తెలుగుదేశం) కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ శ్రీమతి నెలవల విజయశ్రీ విశేష చొరవ మరియు మార్గదర్శకత్వంలో, దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి పంచాయతీ పరిధిలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు సారథ్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.

**కార్యక్రమ విశేషాలు :** గడపగడపకూ ప్రభుత్వ సంక్షేమంలో గత రెండేళ్ల కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రజల నుంచి అపూర్వ స్పందన: ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్న తీరును ప్రజలు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. భాగస్వామ్య నాయకులు: ఈ కార్యక్రమంలో శ్రీధనమల్లి పంచాయతీ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, బూత్ స్థాయి కన్వీనర్లు, ఎంపీటీసీలు మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లేందుకు గౌరవ ముఖ్యమంత్రివర్యుల సహకారంతో నిరంతరం శ్రమిస్తున్నాం. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు చేరడమే మన ప్రభుత్వ అసలైన విజయమని,"ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీధనమల్లి పంచాయతీలో పండుగ వాతావరణం నెలకొనగా, తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం : ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ





**సూళ్లూరుపేట,పెన్ పవర్, ఆగస్టు 13:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. గురువారం సూళ్లూరుపేట పట్టణం లోని ఎస్ వి ఎస్ ఎస్ సి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,జిల్లా ఉపాధి కార్యాలయం,సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత తమ కెరీర్ అభివృద్ధికి జాబ్ మేళాలను తొలి అడుగుగా భావించి, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాల కోసం యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ప్రముఖ కంపెనీలను నియోజకవర్గానికే తీసుకువచ్చి స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ ల మార్గదర్శకత్వంలో యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా 2026 అక్టోబర్ 22న సుమారు 30 కంపెనీలతో మరో భారీ జాబ్ మేళా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలియజేశారు. అనంతరం ఉద్యోగ మేళాలో పాల్గొన్న కంపెనీల హెచ్ ఆర్ ప్రతినిధులతో ఎమ్మెల్యే చర్చించి హాజరైన అభ్యర్థులకు సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. జాబ్ మేళాలో 15 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల కోసం హాజరైన 209 మంది అభ్యర్థులకు గాను 86 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, అతిథుల చేతులతొ కలసి ఆఫర్ లెటర్లు అందజేశారు.

**జాతీయ స్థాయి ప్రతిభకు అభినందన :** ఈ సందర్భంగా స్కిల్ ఇండియా కాంపిటీషన్ లో జాతీయ స్థాయిలో ఫ్లోరిస్టరీ ట్రేడ్‌లో కాంస్య పతకం (బ్రోనజ్ మెడల్ ) సాధించిన ఎస్ వి ఎస్ ఎస్ సి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కుమారి హనీ గ్రేస్‌ను ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అప్పికట్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్ షేక్ సలీమా

### ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీపై సమీక్ష



**బాపట్ల:( పెన్ పవర్ ) ఆగస్టు13** బాపట్ల జిల్లా బాపట్ల మండలం లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 15, 16లను బాపట్ల తహశీల్దార్ షేక్ సలీమా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా సంబంధిత ఓటర్లకు నోటీసుల పంపిణీ జరుగుతున్న తీరును తహశీల్దార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నోటీసుల పంపిణీ పరిస్థితి, ఇప్పటివరకు పూర్తయిన ప్రక్రియ, సంబంధిత ఓటర్ల స్పందన తదితర అంశాలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు సంబంధిత నోటీసు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సిబ్బందికి సూచించారు. నోటీసుల పంపిణీ సమయంలో ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, పంపిణీ చేసిన నోటీసులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఓటర్లకు నోటీసుల ఉద్దేశ్యం, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియపై అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా అందించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి తెలిపారు. నోటీసుల పంపిణీ సమయంలో ఓటర్లు వ్యక్తం చేసే సందేహాలు, అభ్యంతరాలు, సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపట్టే ప్రతి చర్యకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నిర్ణీత గడువులోపు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకమైనదని, అందువల్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తహశీల్దార్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా, అనర్హత కలిగిన లేదా సంబంధిత వివరాల్లో మార్పులు అవసరమైన అంశాలను నిబంధనల మేరకు పరిశీలించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సకాలంలో పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ షేక్ సలీమా తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్ఐఆర్ ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన క్షేత్రస్థాయి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో విద్యను బలోపేతం చేయాలి : సిడిపిఓ జ్యోతి కిరణ్



**దొరవారిసత్రం, పెన్ పవర్, ఆగష్టు 13 :** అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహనతో కూడిన అక్షర జ్ఞానం అందించేందుకు విద్యను బలోపేతం చేయాలని సులూరుపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జ్యోతి కిరణ్ సూచించారు. దొరవారి సత్రం మండల కేంద్రంలోని ఏ కొల్లు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జ్ఞాన జ్యోతి అవగాహన కార్యక్రమం మూడవరోజుగా గురువారం ముగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త మెరుగైన విద్య, పోషణ, సంరక్షణతో పాటు,21 వైకల్యాలను గుర్తించి వారికి అవసరమైన సహాయక చర్యలకు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంకమ్మ, ఎంఈఓ, హై స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి డా.పరసారత్నం కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి నేతలు



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 13 :** మాజీ మంత్రి డాక్టర్ పరసా వెంకటరత్నం కు నాయుడుపేట చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం తిరుపతి నగరంలోని మాజీ మంత్రి పరసా రత్నం నివాసంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట మాజీ జడ్పిటిసి సభ్యులు పేరం శెట్టి శ్రీ రామ్ ప్రసాద్,నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, నాయుడుపేట మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి చిట్టేటి చెంచయ్య,చిట్టమూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గుంపర్ల చిన్నా రావు,తెలుగుదేశం పార్టీ నాయకులు పిగిలాం చెంగయ్య, పలువురు నాయకులు పరసారత్నంకు శాలువాలు కప్పి పుష్పగుచ్చాల అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి పరసా రత్నం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో,ఆనందంగా జీవిస్తూ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## పల్లిపాడులో ఘనంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవాలు

### విశేష అర్చనలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 13:** ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామం గాంధీ కాలనీలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వార్షిక మహోత్సవాల్లో గురువారం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరుగుతున్న వార్షిక మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం సాయంత్రం నిర్వహించిన కలశ దేవత అర్చన, అమ్మవారి విశేష అర్చన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పల్లిపాడు గ్రామ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే గారు ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ వార్షిక మహోత్సవాలు విజయవంతంగా ముగియాలని, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కటాక్షం, ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ప్రార్థించారు. ఈ నెల 14వ తేదీన వార్షిక మహోత్సవాలు ముగియనున్న సందర్భంగా భక్తులు అందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## మానసిక ఆరోగ్యం పై అవగాహన సదస్సు

**బాపట్ల:(పెన్ పవర్), ఆగస్టు13** బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం వారు విద్యార్థినులకు శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ, బాపట్లకు చెందిన డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బి. కృష్ణారెడ్డి ముఖ్య వక్తగా హాజరై విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు తమ శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్ర పొందడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. అలాగే, విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, పరీక్షల భయం మరియు భావోద్వేగ సమస్యలను గుర్తించి వాటిని నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా ఆరోగ్య నిపుణులతో మాట్లాడాలని సూచించారు. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమైనదని వివరించారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో మెరుగైన వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలు అందిస్తూ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందిందని కళాశాల ప్రిన్సిపల్ డా హిమబిందు తెలిపారు.

# మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నా.. పనులు చేశాకే మీ ముందుకు వచ్చా

**కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆలూరుపాడులో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారం గ్రామంలో రూ.2.30 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో సగానికి పైగా పూర్తి చేసి ప్రజల ముందుకు వచ్చాం**



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 13:** ఎన్నికల ముందు ఆలూరుపాడు గ్రామానికి వచ్చినప్పుడు ప్రజలు తమ ముందుంచిన సమస్యల్లో సగానికి పైగా రెండేళ్లలో పరిష్కరించిన తర్వాతే మళ్లీ గ్రామానికి వచ్చానని, తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కొడవలూరు మండలం ఆలూరుపాడు పంచాయతీలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ, రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 'ఎన్నికల ముందు మీ గ్రామానికి వచ్చాను. మళ్లీ రెండేళ్ల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా ఇప్పుడు మీ ముందుకు వచ్చాను. అప్పట్లో నేను రాజకీయ నాయకురాలిగా కాకుండా ప్రజలకు సేవ చేయడానికి వచ్చానని చెప్పాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి మీ ఆశీర్వాదం కోరాను. నా మాటలను నమ్మి భారీ మెజారిటీతో నన్ను గెలిపించారు. ఎన్నికల ముందు మీరు చెప్పిన సమస్యల్లో సగానికి పైగా పరిష్కరించిన తర్వాతే ఈ రోజు మీ ఊరికి వచ్చాను. మీరు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను' అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దాదాపు 99 శాతం అమలు చేసిందని తెలిపారు. చెప్పిన విధంగానే సామాజిక భద్రతా పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచామని, తల్లికి వందనం పథకం ద్వారా చదువుకుంటున్న పిల్లలకు రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఆలూరుపాడు ప్రజలు గ్రామానికి బస్సు సౌకర్యం కావాలని కోరారని, ప్రస్తుతం బస్సు సౌకర్యంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కూడా కల్పించామని వివరించారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు, చేనేత సేవలో ద్వారా చేనేత కార్మికులకు, మత్స్యకారుల సేవలో ద్వారా మత్స్యకారులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.5కే అన్న క్యాంటీన్లలో భోజనం అందిస్తున్నామని, ఆక్వా రైతులను ఆదుకునేందుకు విద్యుత్ ఛార్జీలను తగ్గించామని పేర్కొన్నారు.

**ఆలూరుపాడులో రూ.2.30 కోట్ల అభివృద్ధి పనులు :** ఆలూరుపాడులో గడిచిన రెండేళ్లలో వివిధ శాఖల ద్వారా మొత్తం రూ.2.30 కోట్ల (రూ.2,30,68,000) విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.97.30 లక్షలతో అడ్డవాగు, రేవళ్ల వాగు, లంకా వాగు కాలువల్లో పూడికతీత, రెడ్డిపాలెం--యేగర్లు సైడ్ తూము పునరుద్ధరణ, ఆలూరుపాడు కాలువ వాల్స్ మరమ్మతులు, మోడెగుంట--విడవలూరు కాలువ పునరుద్ధరణ వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. అలాగే ఆలూరుపాడు కాలువపై బ్రిడ్జి, మోడెగుంట--విడవలూరు కాలువపై శ్లాబు, కల్వర్టు, రక్షణ గోడల నిర్మాణానికి ఈ రోజు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ కింద రూ.36 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, సీసీ రోడ్డును ఈ రోజు లాంఛనంగా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ తరఫున రూ.53 లక్షలతో ఒక కిలోమీటర్ 11 కేవీ లైన్, 1.6 కిలోమీటర్ల ఎల్‌టీ లైన్, 63 కేవీ, 25 కేవీ సామర్థ్యం కలిగిన నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 20 ఎస్సీ, ఎస్టీ పేద కుటుంబాలకు రూ.24 లక్షల విలువైన ఉచిత సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు అందించినట్లు వివరించారు.

**తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి:** ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా చేపట్టిన పనులను ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎమ్మెల్యే గారు, 'నేను ఎన్నికల ముందు ఆలూరుపాడుకు వచ్చినప్పుడు తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాం' అని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ.33 లక్షలతో రెడ్డిపాలెం, ఆలూరుపాడులో సీసీ డ్రెయిన్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు, పీఎంఏజీవై (పమాజీ ) గ్రాంట్ కింద నిర్మించిన సీసీ డ్రెయిన్లను ఈ రోజు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ ) ద్వారా ఐదు పేద కుటుంబాలకు రూ.6.38 లక్షల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. సొంత ఇంటి స్థలం ఉన్న 36 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. కొడవలూరు మండలంలో 'రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారం దాదాపు పూర్తయిందని, కార్యక్రమాన్ని ప్రజల్లోకి విజయవంతంగా తీసుకెళ్లిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## పాఠశాలల సమగ్ర సమాచారానికి "యుడైస్ ప్లస్"



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 13 :** పాఠశాలల సమగ్ర సమాచారాన్ని పొందుపరిచి, తదనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడానికి తయారుచేసే ప్రణాళిక యుడైస్ ప్లస్ అని మండల విద్యాశాఖ అధికారి పి.వి.రత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని మేనేజ్మెంట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూ డైస్ ప్లస్ కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలు, సదుపాయాల గురించి సమగ్ర సమాచారం ఖచ్చితమైనటువంటి వివరాలతో పొందుపరచాలన్నారు. విద్యార్థుల నైపుణ్యాలు, సృజనాత్మక కార్యక్రమాలు, తరగతి బోధన, టాయిలెట్స్, ఆటలు, పాటల కార్యక్రమాలను దానిలో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా గండికోట సుధీర్ కుమార్, లింగంగుంట కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూముల పునఃసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి




**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 13:** భూముల పునఃసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సర్వే శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వీవీఎస్ఎన్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం గంగవరం గ్రామంలో పర్యటించిన ఆయన తొలుత భూముల కొలతలకు సంబంధించిన నియంత్రణ కేంద్ర బిందువు ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లకు పలు సూచనలు చేశారు.అనంతరం క్షేత్రస్థాయిలో జరుగుతున్న భూముల సర్వే పనులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పునఃసర్వే సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.మధ్యాహ్నం గిరిజన సంక్షేమ సంస్థ సమావేశ మందిరంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. పునఃసర్వే పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పనులను వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో సర్వే శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వీవీఎస్ఎన్ కుమార్, జిల్లా సర్వే భూసంబంధిత అధికారి శ్రీనివాస్, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సాధించే మంచి విజయమే

**శ్రేణుల పనితీరుకు కొలమానం : ప్రత్తిపాటి**

**ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో నియోజకవర్గ శ్రేణులు బాగా పనిచేస్తారని అధిష్టానానికి మంచి నమ్మకం.**

**పట్టణ, నాదెండ్ల మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో శ్రేణులకు ప్రత్తిపాటి దిశానిర్దేశం**



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 13 :** ప్రజాసేవే ప్రజా ప్రతినిధుల ప్రధాన కర్తవ్యమని, ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజల సంతృప్తి స్థాయి పెంచడంతో పాటు.. ప్రజా సమస్యల పరిష్కారంలో టీడీపీ శ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో పార్టీకి లభించే అపూర్వ విజయమే.. టీడీపీ శ్రేణుల పనితీరుకు కొలమానమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన పట్టణ మరియు నాదెండ్ల మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో కీలకోపన్యాసం చేశారు. తొలుత స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన పట్టణ పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడిన ప్రత్తిపాటి. అనంతరం సంకురాత్రిపాడులో జరిగిన నాదెండ్ల మండల స్థాయి టీడీపీ సమావేశంలో ప్రసంగించారు.

**పట్టణంలో పార్టీ విజయావకాశాలు మెరుగుపడాలి :** చిలకలూరిపేట పట్టణ పార్టీ శ్రేణులు ప్రజలకు చేరువ అవడంలో వెనుకబడుతున్నారని, గతంలో, ఈ రెండేళ్లలో ఎన్నడూ ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి చేసినా పార్టీ శ్రేణుల అనైక్యత, వ్యక్తిగత భేషజాల వల్ల ప్రజల ఆదరణ పొందలేకపోతున్నామని ప్రత్తిపాటి పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణంపై పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులు, కే.ఎస్.ఎస్ లు సమన్వయంతో పనిచేసి, పార్టీ విజయావకాశాలు మెరుగుపరచాలని, ప్రజల్లో మంచి పట్టు సాధించాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొనాలని, మొక్కుబడిగా పనిచేసేవారి విషయంలో కఠినంగానే వ్యవహరిస్తామని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. తమకు అప్పగించిన బాధ్యతల నిర్వహణలో పార్టీ శ్రేణులు ఎవరికి వారు పోటీపడి మెరుగైన పనితీరు కనబరిచి, పార్టీ అధిష్టానం దృష్టిలో పడాలని ప్రత్తిపాటి సూచించారు. నాదెండ్ల మండల పార్టీ శ్రేణుల పనితీరు ఇంకా మెరుగుపడాలని, మండల..గ్రామస్థాయి నాయకులు పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి సమన్వయం, కసితో పనిచేయాలన్నారు. త్వరలో జరిగే పంచాయతీ, ఎంపీపీ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, అప్పుడే కేడర్ పనితీరుకు నిజమైన గుర్తింపు లభిస్తుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

**నియోజకవర్గ శ్రేణుల పనితీరుకు ప్రత్యేక గుర్తింపు :** చిలకలూరిపేట టీడీపీ శ్రేణులకు అధిష్టానం దృష్టిలో ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రభుత్వ.. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో సమర్థవంతంగా పనిచేస్తారనే అభిప్రాయం ఉ ందని ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్ని స్వల్ప వ్యవధిలోనూ అధిష్టానం ఊహించిన దానికంటే మిన్నగా ఎన్నోసార్లు విజయవంతం చేశామన్నారు. పట్టణ, నాదెండ్ల మండల పార్టీ సమావేశాల్లో పార్టీ కార్యక్రమాల అమల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ప్రత్తిపాటి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, షేక్ మస్తాన్ వలి, మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, జయప్రసాద్, సౌరెడ్డి, అమరా రమాదేవి, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా చైతన్య దీప్తి కనుపర్తి



**బాపట్ల :( పెన్ పవర్):** ఆగస్టు13 బాపట్ల మహిళలలో చైతన్యాన్ని రగిల్చి, వారిని స్వాతంత్రోద్యమంలో భాగస్వాములుగా చేశారు కనుపర్తి వరలక్ష్మమ్మ. గాంధీజీ శిష్యురాలిగా జీవితాంతం నేత చీరలే ధరించారు. మహిళల చేత రాట్నలక్ష్మీ వ్రతాలు చేయించి, వారి చేత నూలు వడి కించారు. 'ఓటు పురాణం' రచించి, స్త్రీలందరూ ఎన్నికలలో ఓటు చేయాలని పిలుపునిచ్చారు. స్త్రీ హితైషినీ మండలి ని స్థాపించి స్త్రీల కోసం విద్యాలయాన్ని, గ్రంథాలయాన్ని నిర్వహించారు. ఆమె తన జీవితాంతం స్త్రీల అభ్యున్నతికి పాటుపడ్డారు. కనుపర్తి వరలక్ష్మమ్మ 48 వ వర్ధంతి సందర్భంగా గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో శీలం వారి పాలెం లో గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి నాగమణి,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.అనీల్ కుమార్,అధ్యాపకులు పద్మజ, స్వాతి, కిరణ్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి : తాసిల్దార్ కర్లపాలెం

**ప్రతి ఇంటి మీద జాతీయ పతాకం ఎగురవేయాలని కర్లపాలెం తాసిల్దార్ డి రవీంద్ర కుమార్**



**బాపట్ల( పెన్ పవర్ ) ఆగస్టు13** బాపట్ల జిల్లా నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఎన్ డబ్ల్యు సి. వారు 100 మీటర్ల భారీ జాతీయ పతాకాన్ని కర్లపాలెం లో ప్రదర్శించారు, ఈ కార్యక్రమానికి ఎన్ డబ్ల్యు సి బాపట్ల జిల్లాచైర్మన్ ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ఎమ్మార్వో, ఎంపీడీవో ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుమాట్లాడుతూ దేశాన్ని , పర్యావరణం,పకృతిని కాపాడుకోవాలని అన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ జాతీయ పతాకము యొక్క ప్రాముఖ్యతను వివరించారు ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘఅధ్యక్షులు తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ దేశ సేవ ఎంతో సంతృప్తి ఇచ్చింది అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పాల కేంద్రం వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి, మహా నాయకులను త్యాగాలను స్మరించుకుంటూ, త్రివర్ణ పతాకం యొక్క ప్రాముఖ్యతను వివరించారు ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఎన్ డబ్ల్యు సి డైరెక్టర్లు ఇన కొల్లు పోలీసురావు, ఉప్పెనరసింహారావు, ప్రసాదరావు, స్థానిక టిడిపి నాయకులు వేణు రాజు , స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి విజయశ్రీ, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి ,అంబేద్కర్ సేవాసమితి గౌరవ అధ్యక్షులు మందపాటి పరమానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు

# విధి పట్ల అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం : బాపట్ల కమిషనర్ ఎం. హాసిని




**బాపట్ల( పెన్ పవర్ ) ఆగస్టు 13,** బాపట్ల తొమ్మిది నెలల నిండు గర్భవతిగా ఉన్నప్పటికీ విధి నిర్వహణలో ఎక్కడా అలసత్వం చూపకుండా, సిబ్బంది చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఉన్నతాధికారుల సమావేశాలకు హాజరవుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారాలు చూపుతూ బాపట్ల పురపాలక కమిషనర్ ఎం. హాసిని అందిస్తున్న సేవలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. ఏ క్షణంలో ప్రసవం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లోనూ విధినే బాధ్యతగా భావిస్తూ ఆమె కొనసాగిస్తున్న సేవలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి సమయంలో ప్రసూతి సెలవులు తీసుకుని విశ్రాంతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ విధుల్లో కొనసాగుతున్నారు. పురపాలక కమిషనర్‌గా గతంలో అనుభవం లేకపోయినా, మెడికల్ అడ్మినిస్ట్రేషన్‌లో తనకున్న అనుభవాన్ని, ఉన్నత ఆలోచనలను పరిపాలనలో ఆచరణలోకి తీసుకువస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఇటీవల బాపట్లలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె పూర్వపు సహ ఉద్యోగులు కార్యక్రమం అనంతరం కార్యాలయంలో ఆమెను కలుసుకుని పాత అనుభవాలు, జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సెలవు తీసుకోవచ్చు కదా అని వారు సూచించగా, సిబ్బందికి జీతాలు వేసిన తర్వాతే సెలవు తీసుకుంటాను అని ఆమె చెప్పడం సిబ్బంది పట్ల ఆమెకున్న ఆప్యాయత, బాధ్యతాయుత వైఖరికి నిదర్శనంగా నిలిచింది.

**వారం రోజుల్లోనే డ్రైనేజీ సమస్యకు పరిష్కారం:** బాపట్ల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ రోడ్డులో గత రెండేళ్లుగా దెబ్బతిన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన కమిషనర్ హాసిని వారం రోజుల్లోనే నూతన మ్యాన్‌హోల్ డ్రైనేజీ కవర్ల ఏర్పాటును పూర్తి చేయించారు. దీంతో స్థానిక ప్రజలు ఆమె చొరవను అభినందిస్తున్నారు.

**స్వాతంత్ర్య వేడుకల నిర్వహణలోనూ చురుకైన పాత్ర :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీలలో పాల్గొంటూ, వివిధ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ కమిషనర్ ఎం. హాసిని చురుకైన పాత్ర పోషిస్తున్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో దేశం కోసం వీరమరణం పొందిన అమరవీరులకు నివాళులర్పిస్తూ, జాతీయ స్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతున్నారు. ఆగస్టు 15న బాపట్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడమే లక్ష్యంగా ఆమె విధులను నిర్వర్తిస్తున్నారు. విధి పట్ల అంకితభావం, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ, సిబ్బంది పట్ల ఆప్యాయతతో సేవలందిస్తున్న కమిషనర్ ఎం. హాసినికి పట్టణ ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.


# బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఎన్‌సీసీ "బి ", "సి" సర్టిఫికెట్ల పంపిణీ

**బాపట్ల( పెన్ పవర్), ఆగస్టు 13:** బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఎన్‌సీసీ బి మరియు సి సర్టిఫికెట్లు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 22 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ, తెనాలి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ. ఉదయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, ఎన్‌సీసీ క్యాడెట్లకు బి, సి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్‌సీసీ శిక్షణ ద్వారా క్యాడెట్లలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవా భావం మరియు ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. ఎన్‌సీసీ ద్వారా పొందిన అనుభవాలు విద్యార్థుల భవిష్యత్తు విద్యా, ఉద్యోగ మరియు వ్యక్తిగత జీవితాల్లో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ సుబేదార్ సురేంద్ర క్యాడెట్లను అభినందిస్తూ, ఎన్‌సీసీ శిక్షణలో వారు చూపిన ప్రతిభను ప్రశంసించారు. బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. టి. ఈ. గోపాలకృష్ణ మూర్తి మాట్లాడుతూ, ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు నాయకత్వ సామర్థ్యాలు, సామాజిక బాధ్యత మరియు దేశ సేవ పట్ల నిబద్ధత పెంపొందుతున్నాయని అన్నారు. బి, సి సర్టిఫికెట్లు సాధించిన క్యాడెట్లను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎన్‌సీసీ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ సుష్మా యార్లగడ్డ మాట్లాడుతూ, బి మరియు సి సర్టిఫికెట్లు సాధించిన క్యాడెట్లకు అభినందనలు తెలిపారు. క్యాడెట్లు ఎన్‌సీసీ శిక్షణలో క్రమశిక్షణతో పాల్గొని, వివిధ క్యాంపులు, శిక్షణ కార్యక్రమాలు మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ విజయానికి సహకరించిన కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, కమాండింగ్ ఆఫీసర్ జె సి ఓ, మరియు ఎ ఎన్ ఓ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# కారంచేడు మండల టీడీపీ నూతన కమిటీ ఏర్పాటు





**కారంచేడు, పెన్ పవర్, ఆగస్ట్ 13 :** తెలుగుదేశం పార్టీ కారంచేడు మండల నూతన కమిటీని గురువారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రకటించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రకటించిన కమిటీకి అధ్యక్షుడిగా షేక్ ఖాసిం సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా యార్లగడ్డ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నూతన కమిటీ నాయకత్వంలో కారంచేడు మండలంలో టీడీపీ మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కమిటీ సభ్యులు పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.

# పిల్లల విద్యాప్రమాణాల మెరుగుదలలో అంగన్వాడీలదే కీలకపాత్ర



**పెడన, పెన్ పవర్, ఆగస్టు 13 :** రెండేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ప్రాథమిక విద్యాప్రమాణాలను మెరుగుపరచడంలో అంగన్వాడీలది కీలకపాత్ర అని బంటుమిల్లి--పెడన సీడీపీవో సముద్రవేణి అన్నారు. గురువారం పెడన బంగ్లా స్కూల్‌లో అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన 'జ్ఞానజ్యోతి' తొలి విడత మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమం జరిగింది. పిల్లల సంసిద్ధతా నైపుణ్యాలు, అంగన్వాడీలలో ప్రణాళిక, నిర్వహణతో పాటు మైండ్ మ్యాపింగ్ కాన్సెప్ట్‌పై శిక్షణ ఇచ్చారు. రెండో విడత శిక్షణ ఈ నెల 22, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు సీడీపీవో తెలిపారు. చిన్నారులకు ఇంగ్లిష్ విద్యాబోధనను కూడా అలవాటు చేయాలని బంగ్లా స్కూల్ హెచ్ఎం భాగ్యలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు సత్యనారాయణ, శివరామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమంపై విద్యార్థులకు అవగాహన అవసరం




**మచిలీపట్నం, పెన్ పవర్, ఆగస్టు 13 పెడన :** విద్యార్థులు విద్యతో పాటు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం గురించి అవగాహన కలిగి ఉండాలని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కళాశాల విద్యార్థులు పట్టణ పురవీధుల్లో 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. లక్ష్మి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాలను నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు, అధ్యాపకులు సాజిదా సుల్తానా, జ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్‌పై టీడీపీ నాయకుడు దాడి

ఏపీలోని కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. అధికారం అడ్డుపెట్టుకొని టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. తాజాగా పోలీస్ కానిస్టేబుల్‌పై టీడీపీ నాయకుడు దాడికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే..ర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఇంకుడు గుంత నిర్మాణంపై ఫిర్యాదు అందుకుని వచ్చిన పోలీసులపై టీడీపీ నాయకుడు శ్రీనివాసులు గౌడ్ దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఎస్ఐకి ఫోన్ చేసి.. తిరిగి మీ మీదనే కేసు పెడతాను అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. కాగా, నిన్న శ్రీకాళహస్తిలో కానిస్టేబుల్‌పై దాడి చేసిన యువకులను రోడ్డుపై కొట్టుకుంటూ తీసుకెళ్లిన పోలీసులు.. ఇప్పుడు టీడీపీ నాయకుడిపై కూడా అదే స్థాయిలో చర్యలు తీసుకుంటారా? అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

# ప్రతి పౌరుడి బాధ్యత దేశ సేవతో సమానం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి






**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 13 :** స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా తిరంగా యాత్ర (బైక్ ర్యాలీ) నిర్వహించారు. శ్రీనివాసరావుపేటలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ చుట్టుగుంట, నగరంపాలెం, ఎత్తురోడ్డు మీదుగా సంపత్‌నగర్‌లోని రామనామ క్షేత్రం ఎదురుగా ఉన్న భారతమాత విగ్రహం వరకు సాగింది. ర్యాలీలో వందలాది మంది ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, దేశభక్తులు జాతీయ జెండాలను చేతబూని పాల్గొన్నారు. 'భారతమాతకు జై', 'వందేమాతరం' నినాదాలతో ర్యాలీ మార్మోగింది. భారతమాత విగ్రహం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఎన్డీయే కూటమి నేతలతో కలిసి జాతీయ గీతం 'జనగణమన' ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. స్వాతంత్ర్యం కోసం ఎందరో సమరయోధులు, వీరులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తున్నామని తెలిపారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్న సైనికులు, దేశంలో శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీసుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. "ప్రతి పౌరుడు సమాజం కోసం తనవంతు బాధ్యత నిర్వర్తిస్తే సరిహద్దులోని సైనికుడితో సమానమే" అని అన్నారు. ఒక మొక్క నాటడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, సమాజ అభివృద్ధికి తోడ్పడటం వంటి ప్రతి చిన్న చర్య కూడా దేశభక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. భావితరం దేశ గౌరవాన్ని మరింత పెంచేలా చైతన్యవంతంగా, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని కోరారు. హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసే సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఇంటికి జాతీయ జెండాను అందించి దేశభక్తి భావాన్ని మరింత బలపరిచేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన తిరంగా యాత్రను భారతమాత విగ్రహం వద్ద ముగించి, సమాజం, దేశం కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలనే ప్రతిజ్ఞ చేశారు. దేశాభివృద్ధికి సేవా భావంతో ప్రతి పౌరుడు ముందుకు రావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# నేతన్న సేవ అమలుపై వైఎస్సార్‌సీపీ, చేనేత నేతల ఆగ్రహం



**చీరాల, పెన్ పవర్, ఆగస్ట్ 13:** కూటమి ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న 'నేతన్న సేవ' పథకం అమలు తీరుపై చీరాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, చేనేత నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం అమలులో అక్రమాలు జరుగుతున్నాయని, అసలైన చేనేత కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ బాపట్ల జిల్లా చేనేత శాఖ కార్యాలయం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. చీరాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. చేనేత వృత్తితో సంబంధం లేని అనర్హులకు ముడుపులు తీసుకుని 'నేతన్న సేవ' కింద రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారని ఆరోపించారు. రేయింబవళ్లు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అర్హులైన కార్మికులు తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో 'నేతన్న నేస్తం' పథకం ద్వారా జియో ట్యాగింగ్ విధానంతో పారదర్శకంగా అర్హులను గుర్తించి 84 వేల మంది చేనేత కార్మికులకు ప్రతి ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించామని వారు పేర్కొన్నారు. అప్పట్లో ఉన్న పారదర్శక జాబితాను పక్కనపెట్టి కొత్తగా అనర్హులకు లబ్ధి చేకూర్చడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడి అనర్హులకు లబ్ధి చేకూర్చిన అధికారులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించి సంబంధిత అధికారులపై ప్రైవేట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఈ వారంలోనే 'నేతన్న సేవ' కింద రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాతం మేరి బాబు, వేటపాలెం మండల పార్టీ అధ్యక్షుడు సాదు రాఘవ, బొడ్డు సుబ్బారావు, బత్తుల అనిల్, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకర్, కంప అరుణ్, కర్ణ లక్షరావు, మాజీ ఉపసర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, బీరక కేదారేశ్వరరావుతో పాటు పలువురు చేనేత నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలి

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్



**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 13 :** జార్ఖండ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్ ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం, కాల్పులకు పాల్పడటం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులపై జరిగిన దాడులను ఖండిస్తూ గురువారం గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జార్ఖండ్‌లో జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించి పేపర్ లీక్ ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో విద్యార్థులు, నిరుద్యోగులు న్యాయమైన డిమాండ్లతో ఆందోళన చేస్తున్నారని శ్రీనివాస్ తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసు చర్యలకు దిగడం సరికాదన్నారు. విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. జార్ఖండ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. విద్యార్థులపై జరిగిన చర్యలకు ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ప్రభుత్వం బాధ్యత వహించి, వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో విద్యార్థుల సమస్యలపై రాజకీయ పార్టీలు భిన్నమైన వైఖరులు అవలంబిస్తున్నాయని శ్రీనివాస్ విమర్శించారు. జార్ఖండ్‌లో విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు కూడా ఆయా పార్టీలు మద్దతు ఇవ్వాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సిద్ధమైన సమయంలో రాహుల్ గాంధీ సభ నుంచి వెళ్లిపోయారని శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు దేశంలో ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ప్రతిపక్ష కూటమికి మద్దతుగా వ్యవహరిస్తోందని శ్రీనివాస్ విమర్శించారు. దేశంలోని విద్యార్థులు, యువత రాజకీయ పార్టీల ప్రచారాలను నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని సూచించారు. జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన దాడులను దేశ ప్రజలందరూ ఖండించాలని బీజేపీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

# అంగరంగ వైభవంగా ఫుల్ డ్రెస్ రిహార్సల్స్




**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 13 :** 80వ స్వాతంత్ర దినోత్సవ ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ అమరావతి పెరేడ్ గ్రౌండ్స్ లో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ బి. రాజకుమారి చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో గుంటూరు పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ పోలీస్ సమన్వయ అధికారిగా వ్యవహరిస్తున్నారు. పెరేడ్ కమాండర్ గా వైయస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఏ ఎస్ పి యు విభూ కృష్ణవ్యవహరిస్తుండగా, పెరేడ్ సెకండ్ ఇన్ కమాండ్ గా 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ మహబూబ్ బాషా,హొహొపెరేడ్ ఎడ్జెంట్ గా 14వ బెటాలియన్ ఇన్స్పెక్టర్ టి రాఘవేంద్ర వ్యవహరిస్తున్నారు. 80 స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో మొదటి కంటిన్ జెంట్ గా కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్,హొహొరెండవ కంటిన్ జెంట్ గా కాకినాడ ఏపీఎస్పీ మూడవ బెటాలియన్,హొహొమూడవ కంటిన్ జెంట్ గా కర్ణాటక స్టేట్ పోలీస్,హొహొనాలుగవ కంటిన్ జెంట్ గా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఐదవ కంటిన్ జెంట్ గా విజయనగరం ఏపీఎస్పీ 5వ బెటాలియన్, ఆరవ కంటిన్ జెంట్ గా విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్, ఏడవ కంటిన్ జెంట్ గా బాలుర ఎన్సిసి, 8వ కంటిన్ జెంట్ గా బాలికల ఎన్సిసి, తొమ్మిదవ కంటిన్ జెంట్ గా రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్ (బాలురు, బాలికలు), పదవ కంటిన్ జెంట్ గా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, 11వ కంటిన్ జెంట్ గా రెడ్ క్రాస్ సొసైటీ, 12వ కంటిన్ జెంట్ గా ఏపీ సైనిక్ వెల్ఫేర్ శాఖ ప్రదర్శనలో పాల్గొన్నాయి.హొహొ బ్యాండ్ ఇన్ నెట్ లో భాగంగా కర్నూల్ ఏపీఎస్పీ రెండవ బెటాలియన్, కాకినాడ ఏపీఎస్పీ మూడవ బెటాలియన్, విజయనగరం ఏపీఎస్పీ ఐదో బెటాలియన్, మంగళగిరి ఏపీ ఎస్పీ ఆరవ బెటాలియన్, వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్, భాకర్పేట ఏపీఎస్పీ 11వ బెటాలియన్, అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్, విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్, హైదరాబాద్ ఏపీ యూనిట్ ఎస్ ఏ ఆర్ సి పి ఎల్ పాల్గొన్నాయి. పైప్ బ్యాండ్ గా మంగళగిరి ఏపీఎస్పీ బ్యాండ్ పాల్గొంది. ఈ కార్యక్రమంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, సమాచార పౌర సంబంధాల శాఖ ఇన్చార్జ్ సంచాలకులు బి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రోటోకాల్ అనుసరించి సమయాన్ని అనుసరించి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. 25 శాఖలకు సంబంధించిన ప్రగతిని వివరించే శకటాల ప్రదర్శన జరిగింది.

# బైపాస్‌పై పెట్రోల్ ట్యాంకర్ బోల్తా



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 13 :** బైపాస్ రోడ్డులోని లింగాయపాలెం సమీపంలో ఇంధనంతో వెళ్తున్న ఓ పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ట్యాంకర్‌లో ఇంధనం నిండి ఉండటంతో, ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు, ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా ఆ మార్గంలో ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. అధికారుల సత్వర స్పందనతో పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

# పండరీపురంలో తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

## రూ.లక్ష నగదు, బంగారం, వెండి అపహరణ



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 13 :** చిలకలూరిపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పండరీపురంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల, స్థానికుల వివరాల ప్రకారం.. పండరీపురం 9వ లైనులో నివాసం ఉంటున్న కొమ్మబోయిన వెంకట శివరావు (64), తన భార్యతో కలిసి ఈ నెల 1న హుబ్లీలో నివాసం ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అయితే బుధవారం రాత్రి వారి ఇంట్లో లైట్లు వెలుగుతుండటాన్ని ఇరుగుపొరుగు వారు గమనించారు. అనుమానం వచ్చి ఇంటి వద్దకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంటి మెయిన్ గేటుకు వేసిన తాళం అలాగే ఉండగా, మెయిన్ డోర్ తాళాన్ని పగులగొట్టి దుండగులు లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. బీరువాలో ఉంచిన 2 సవర్ల బంగారు ఆభరణాలు, 1 కిలో వెండి వస్తువులు, రూ.1 లక్ష నగదును దుండగులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. ఈ చోరీ ఆగస్టు 11 లేదా 12 తేదీల్లో జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.

# క్యాన్సర్ పై కిమ్స్ శిఖర ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమము




**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 13 :** కిమ్స్ శిఖర తక్కెళ్లపాడు వారి ఆధ్వర్యంలో , ఆర్ యంపీ, పియంపి, పట్టణ, గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక, ఆరోగ్య అవగాహన సదస్సు, గురువారం ఫిరంగిపురం లో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ కందుల రాము, మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న జీవన శైలిలో అనేక రకాల క్యాన్సర్ సమస్యలపై, కార్యక్రమంలో పాల్గొన్న, గ్రామీణ వైద్య మిత్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా, ఎఫ్ ఎఫ్ యంపీఏ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు, యామర్తి నాగేశ్వరరావు, ఎఫ్ ఎఫ్ యంపీఏ రాష్ట్ర ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల,జోనల్ సెక్రటరీ, ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్ వలి, టి వెంకయ్య, మనోహర్,లతో కలిపి, 110 మంది, గ్రామీణ వైద్య మిత్రులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం

## ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య

ఏపీలోని గుంటూరు జిల్లాలో ఇద్దరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. జిల్లాలోని పొన్నూరు డీవీసీ కాలనీలో నివాసముంటున్న మేళం చిరంజీవి( 37) , బర్కతునిస్సా ( 35 ) అనే ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుంది. రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు వివరించారు. మృతదేహాలను ఆసుపత్రికి తరలించి , కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పొన్నూరు పోలీసులు వెల్లడించారు.